సీరియల్ కథ

# నిర్దోషి

★

రచన : "ప్రవీణ్ సుశ్రీ"



(గత సంచిక తరువాయి)

శంకరం సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె పైకితీస్తూ ఏరా ఇన్నాళ్ళు నీవేదో తెలివిగలవాడవని మంచివాడవని, మీఅమ్మకు ఇచ్చిన మాటకోసం నిన్ను స్కూలుకు పంపుతూంటే! నీవు చేసే నిర్వాకం ఇదన్నమాట నాజేబులో ఈమధ్య డబ్బులుపోవడం గూడా అయితే! అదీనీపనే నన్నమాట! ఏరా మాట్లాడ వేమిరా? చెప్పు? అని శంకరం కోపంగా రామూ జబ్బ పట్టుకుని గుంజాడు.

రామూకేవీమీ వినిపించడంలేదు, నిలువెల్లావణికిపోతున్నాడు ఎందుటాకులా నోట్లోంచి మాట పెగిల్రాడం లేధు. భయంతో! భాదతో "బాబుగారూ!" అన్నాడు ఎంతో దీనాతిదీనంగా. క్లాసులో అల్లరిచెయడం, స్కూలు ఎగ్గొట్టి కాలువలవెంట తిరగటం! ఊ! ఇదా నీవు వెలగబెడ్తున్న చదువు? "అని దబా! దబా! బాదాడు. అసలు దెబ్బంటే ఏమిటో ఎరుగని రాము "అమ్మా!" అని పెద్దగా అరిచాడు.

ఇంతలో కాంతమ్మ గిరిని కొడుతున్నాడేమోనని ఆతరతగా పరుగెత్తుకుని రావడంతో తలుపుతట్టుకొని, కాలి బొటనవ్రేలుకి దెబ్బతగిలింది. గడపను తిట్టుకుంటూ అక్కడికిరావడంతో గిరి ఎంతో సంతో సంతోషించాడు. ఆమె శంకరంగారిని చూసి "ఏమిటండీ! అసలు సంగతేమిటి?" అని అడిగింది.

రాముకిదంతా అయోమయంగా వుంది. కంటినుండి అశ్రుధారలు కట్టలు తెగిన ఏరులా ప్రవహిస్తున్నాయ్! తను ఏతప్పు చేయనప్పటికీ మొదటినుంచి "విధి" తనను తరుము కుంటూనే వస్తుంది. "బాబూ! నేనాపని చెయ్యను బాబూ! నేనటువంటి వాడినికాదు బాబూ!" అని అందామనుకున్నాడు. ఒకసారి గిరి వైపు చూశాడు గిరి గుడ్లు మిటకరించి చూశాడు.

వాళ్ళుముగ్గురూ రామూ పాలిట యమకింకరులులా అగుపించారు.

"ఏరా! అలా చూస్తావేరా! ముష్టివెధవా? నీ మొఖానికి చదువెందుకురా! రేపటినుంచి బడికి వెళ్ళడానికి వీలు లేదు. ఈరోజు అన్నంకూడా పెట్టకు వెధవకి" అని కాంతమ్మతో చెప్పి కోపంగా బయటకు వెళ్ళిపోయాడు శంకరం.

కాంతమ్మ కాసేపటికి గిరి ద్వారా విషయమంతా గ్రహించింది. "ఏరా! వెధవా! సిగరెట్లు తాగుతున్నావా!...దొంగతనం గూడా మొదలెట్టా వన్నమాట!" అంటూ! ఒక మొట్టికాయ గట్టిగా వడ్డించి... కోపంగా వెళ్ళిపోయింది.

గిరికూడా కాలరు ఎగరేసుకుంటు బయటకు వెళ్ళాడు.

రామూ ఏడుస్తూ ఇల్లు వూడవసాగాడు. ఆ కన్నీటి బొట్లు బొటబొటా బండలమీద కారుతూంది, చీపురుతో తుడుస్తున్నాడు. మొత్తానికి ఆరోజు రాము కన్నీటితో ఆగదిని కడిగివేశాడు.

ఆ మరుచటి రోజునుంచీ రామూను బడికి పంపడం మానివేసారు...ఇంట్లో రామూచేత ఇదివరకు తనతల్లి లక్ష్మమ్మ చేసిన పనులన్నీ చేయిస్తుంది కాంతమ్మ.

రాము ఇంట్లో నానాబాధలుపడ్తుంటె గిరి వాళ్ళ స్నేహితులతో ఆనందంగా గడుపుతున్నాడు. అప్పుడప్పుడు నీలకంఠం గడియారం గురించి గిరిని అడిగేవాడు. కాని, సమయం రావద్దా అనడం గిరికి పరిపాటైంది. రామూని ఎలాగైనా ఇంటినుండి వెళ్ళగొట్టాలని నిర్ణయించుకున్నాడు గట్టిగా.

ఒకరోజు రాము ఒంటరిగా కూర్చొని ఇలా విచా

రించసాగాడు. "గిరికి నేనేమి చేశాను? ఎటువంటి అపకారమూ చేయలేదే? మరెందుకు నేనంటే గిరికి అంత కోపం?... నావల్ల క్లాసులో ఫస్టు మార్కులు రావడము వల్ల గిరిని బాబుగారు కొట్టారని కాబోలు... అది నా తప్పా? తన స్నేహితులతో నన్ను ఎన్నోసార్లు కొట్టించాడు. ఇంకెన్నెన్నో విధాలుగా నన్ను బాధించాడు. అవన్నీ మరి నేను బాబుగారికి చెప్పలేదే? నేను వాళ్ళ పనివాణ్ణి వాళ్ళు నా యజమానులు. నావల్ల గిరికి బాధలు కలుగరాదు. నేనే ఇక్కడినుంచి వెళ్ళిపోతాను. ఈ విశాల ప్రపంచంలో నా ఒక్కనికి పని దొరకక్కపోతూందా?"

చివరికి అక్కడి నుండి వెళ్ళి పోవడానికే నిర్ణయించుకున్నాడు.

బయట చిమ్మచీకటి రాజ్యంచేస్తోంది. ప్రకృతి భయంకరంగా వుంది...దట్టంగా మబ్బు కమ్ముకుంది...కిటికీలోంచి చల్లనిగాలి రివ్వున వీస్తోంది...వానవచ్చేట్టుగా వుంది.

...రామూ గాలికి తట్టుకోలేక పోతున్నాడు. చలికి గజగజవణికి పోతున్నాడు. రామూలాగే ఆ చిమ్మచీకటిలో ఆ గుడ్డిదీపంకూడా గజగజా వణికిపోతూంది... అప్పుడో! ఇప్పుడో అన్నట్టుగా వున్న టి.బి. పేషంటులా వుందా గుడ్డిదీపం...కిటికీలోంచి ఆచల్లని గాలితోపాటు సన్నని తుప్పర రావడం ప్రారంభించింది.

లేచి కిటికీ వేద్దామనుకున్నంతలోనే ఆగాలి ఆగుడ్డిదీపం ఆర్పివేసి ఒలిగొంది. మళ్ళీదీపం వెలిగిద్దామన్నా అగ్గిపెట్టె లేదు. భయం మరింత ఎక్కువైంది...ఆ రాత్రికి వెళ్ళిపోదామనుకున్న తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. అయినా యజమానికి చెప్పకుండా వెళ్ళడం సబబుగా తోచలేదు. రేపు ఉదయం చెప్పి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు...ఆ చీకట్లో ... ఆ నిర్ణయం తీసుకున్న పిదపనే...హాయిగా నిద్రపోయాడు.

మరుసటిరోజు మామూలుగానే తెల్లవారింది. కాంతమ్మ తనపనుల్లో మునిగివుంది. రామూ తనపనులన్నీ ముగించుకుని, తనురాత్రి నిర్ణయించుకున్న ప్రకారం తన చినిగిపోయిన బట్టలనే మూట్టగట్టుకుని శంకరంగారి దగ్గరకు వచ్చాడు. కానీ ఏమని చెప్పాలో ఎలాచెప్పాలో తెలియక భయపడుతూ అలాగే నిల్చుండి పోయాడు

బనియన్ల తయారింపులో
మాప్రత్యేక తయారింపులు
★గాయత్రి ఫైన్-సరైన కొలత
★విస్పా ఫైన్-సరైన కొలత
★T.N.H స్పెషల్-సరైన కొలత
★హాంగ్ కాంగ్-(రీసైజు)
★నైలాన్ బనియన్లు(రీసైజు)
తయారించువారు:
ది నంజప్పా హొజియరీస్ తిరుపూర్ 2

ఆంధ్రా మరియు ఒరిస్సా జిల్లాలకు ఏజెంట్లు:
దుర్గా ఏజెన్సీస్ పి. బి. నెం. 84, విశాఖపట్నం.

తలక్రిందికి దించుకొని.

"ఏరా! రామూ! అలానిలబడ్డావేం? అమూటేమిటి? ఎక్కడికి?...ఇంటిలో పనులన్నీ అయిపోయాయా?" అన్నాడు శంకరం చూసి.

చేశానన్నట్లు గతలూపాడు.

"మరి నీకింకేమీ పనిలేదా?" మళ్ళీప్రశ్నించాడు.

వరండాల్లో పుస్తకం తిరగేస్తున్న గిరి, వంటగదిలోంచి కాంతమ్మవీరి మాటలు విని ఒక్కసారిగా పరుగెత్తుకుంటు వచ్చారు.

వాళ్ళిద్దరినీ రాము ఓమారు అదోలాచూసి "బాబుగారూ!......నేనిక వెళ్ళిపోతాను బాబూ!...నాకిక సెలవిప్పించండి బాబూగారూ!" అన్నాడు ఎంతో బాధను దిగమ్రింగుతూ భయపడుతూ.

శంకరంతో పాటు కాంతమ్మ గిరి ఆశ్చర్యచకితులై ఒకరిమొఖాలు ఒకరు చూచుకున్నారు. గిరి మాత్రం తనలో తను చిన్నగా నవ్వుకున్నాడు.

"బాబుగారూ! మీరు నన్ను అన్నివిధాల ఆదుకున్నారు. తల్లితండ్రిలేనిలోటును తీర్చి నన్నింతటి వాణ్ణి చేశారు. ఈ జన్మలో మీ ఋణం తీర్చుకోలేను...నేనిక ఇక్కడ వుండలేను. ఎక్కడికైనా వెళ్ళి పనిచేసుకొని బ్రతుకుతాను." అన్నాడు రాము రుద్ధకంఠంతో.

శంకరంగారికి ఏమీతోచక కాంతమ్మవైపు చూశాడు ఆమె ఏదో సైగ చేసింది.

రాము గిరి దగ్గరకువచ్చి "చిన బాబుగారూ! నేను




ఆంధ్రా మరియు ఒరిస్సా జిల్లాలకు ఏజెంట్లు:
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం.

మీవిషయంలో ఏదైనా తప్పచేసివుంటే దయచేసి నన్ను మన్నించండి బాబూ!" అంతకంటె ఎక్కువగా ఏమీ మాట్లాడలేక పోయాడు. అంతకంటే ఎక్కువగా ఏమీ మాట్లాడగలడు? ఏమి మాట్లాడినా అనవసరము అవుతూంది.

మాటల్లో దీనత్వం, హృదయంలో ఆవేదన ముఖంలో నిర్జమతోణికి సలాడుతున్నాయి. శంకరంగారు రామూతో ఏదో మాట్లాడుతుండగా గిరికి చటుక్కున మెదడులో ఓ ఆలోచన మెరిసింది. ఇదేమంచి సమయం అనుకున్నాడు సంతోషంతో తండ్రిగదిలోకి మెల్లగావెళ్ళి చప్పుడుగాకుండా ఎవరూ చూడకుండా సొరుగులోంచి గడియారం దొంగిలించి దొడ్డిదారిగుండా నీలకంఠం ఇంటికి వెళ్ళి అది వాడి చేతికిచ్చి, విషయం అంతా చెప్పి, "రాము ఇటు వచ్చేప్పుడు నీవు ఎదురుగా వెళ్ళి పలుకరిస్తుండు నేను మళ్ళీవచ్చి మిమ్ములనిద్దరినీ కలుస్తాను." అని నీలకంఠానికి చెప్పి మరలా దొడ్డిడారిగుండా వచ్చేశాడు. గిరి ఇంటికి వచ్చేపటికి రాము ఇంటినుండి వెళ్ళిపోయాడు. కాంతమ్మ "పీడ విరగడైంది" అనుకుంటు వంటిలోకి దారితీసింది. గిరి జరుగబోయే నాటకాన్ని కళ్ళ ముందుంచుకొని సంతోషంగా ముందర పుస్తకం వేసుకొని కూర్చున్నాడు. నాటకానికి ప్రార్థనా గీతం పాడాడు.

...మొదటి అంకం ఇక ప్రారంభించ బోతున్నారు.

ఈనాటికి తనకోరిక తీరుతున్నందుకు ఎంతో సంతోషంతో తబ్బిబ్బైపోయాడు తను చక్కగా మద్రాసు వెళ్ళి అడయారులోని మర్రిచెట్టు, విమానాశ్రయం, ఇంకా సినిమాస్టూడియోలు, అక్కినేని నాగేశ్వరరావుని, శోభన్నన్ని అందర్నీ చూడవచ్చు. ఒకటేమిటి అన్నీ వరుసగా చూడవచ్చునని మురిసిపోతున్నాడు.

శంకరం రాము వెళ్తుంటే వారించలేక పోయాడు, వుండమనీ చెప్పలేక పోయాడు, వెళ్ళమనీ చెప్పలేక పోయాడు.

...ఏదో ఆలోచనల్లో మునిగిపోయాడు... వెంటనే తను వూరువెళ్ళాలనే విషయం గుర్తుక వచ్చింది. బట్టలు వేసుకుని తయారై, తన గదిలోకి వెళ్ళిడ్రాయరుసొరుగు తీశాడు తన ఎసీకార్ వాచ్ కోసం...అది అక్కడలేదు సొరుగులోవున్న వస్తువులన్నీ క్రిందా మీదా పడవేసి అంతా వెదకుతున్నాడు, అయినా అగుపించలేదు శంకరానికి కంగారు పుట్టింది...

"గిరీ నా గడియారం తీసేవా?" అన్నాడు పెద్దగా.

వరండాలో కూర్చున్న గిరి నాటకం ప్రారంభం అయినందుకు సంతోషించాడు. "ఏమిటి నాన్నా! మీ గడియారమా? లేదే! నేను తీయలేదే?" అన్నాడు.

శంకరం అరుపులకు కాంతమ్మ వంటఇంటిలోంచి వచ్చింది. "ఏమిటండీ! వెదకుతున్నారు? వూరికి వెళ్ళడానికి మీకు టైముకాలేదా" అంది.

ఆ మాటలు వినబడునట్లు, తను వెదకడంలోనే మునిగిపోయాడు, కాంతమ్మ వైపు అసలు చూడనే లేదు.

"అబ్బబ్బ!...నాతో చెప్పగూడదా ఏమిటి?... పలుకరించినా పలుకరేం? అందివినుగ్గా.

"నాడ్రాయరు సొరుగులో"...అని ఆర్డోక్తిలో ఆవి మరలా వెదకడం ప్రారంభించాడు.

"ఆ మీడ్రాయరు సొరుగులో...అపారేం? ఏం జరిగిందో చెప్పండి? అంది ఆత్రుతగా.

"నావాచీ రాత్రిఇక్కడే పెట్టాను ఇప్పుడేమో కనిపించడంలేద" అన్నాడు శంకరావు.

"ఇంకేం నేను అనుకున్నంత అయ్యింది! ఒరేయ్! గిరి ఆ దొంగవెధవ యింకా మనసుబ్రహ్మణ్యం కొట్టు దాటివుండడు వెంటనేవెళ్ళి వాణ్ణి ఈడ్చుకురారా!" అంది కాంతమ్మ కంగారుగా.

ఆ సమయంకోసమే ఎదురు చూస్తున్న గిరి వెంటనే

వీధిలోకి పరుగెత్తాడు.

శంకరానికేమీ పాలుపోవడం లేదు కోపంతో అటూ! ఇటూ! తిరుగుతున్నాడు.

"మీకు రైలుకు టైం అయ్యింది గదండీ!" అంది కాంతమ్మ నిదానంగా.

"అయ్యింది నాకు తెలుసు నీవేం చెప్పనక్కరలేదు".

"అబ్బ! అంతకోపం ఎందుకండి!...మరిమీరు వూరికి వెళ్ళరా? అని"

"అదే! నేనూ ఆలోచిస్తున్నాను. వీడు తొందరగా వస్తే వెళ్ళిపోవచ్చు కానివీడు ఇంకారాలేదు రాడా!" బయటికి చూస్తూ అన్నాడు.

"ఎంతపని చేశాడు? ఎంతపని చేశాడు? మీరేమన్నా అనండి నాకు మొదటినుంచీ వాడిమీద అనుమానమే! మీరు మొదట్లోనే జాగ్రత్త తీసుకుంటే వాడిలా దొంగతనం చేసేవాడా?" అని ఇంకేమేమిటో అంటుండగానే...గిరి, నీలకంఠం, రామూ రెండు చేతులను పట్టుకుని లాక్కొచ్చారు. ఒక పెద్దఘనకార్యం సాధించినట్లుగా! రామూ గజ! గజ! వణికి పోతున్నాడు.

"ఎక్కడ దొరికాడురా వీడు!"? అన్నాడు శంకరం.

"అసలు దొరికేవాడు గాదు బాబాయ్! నేను బజారు వెళ్తూ చూశాను, వీడివాలకం ... ఎక్కడికెళ్తున్నావు రామూ" అని మర్యాదగా అడిగితే!..."నీ కెందుకోయ్! అన్నీ నీకు చెప్పాలా!" అన్నాడు బాబాయ్!.

"మరి ఇంటిలో చెప్పావా?" అని అడుగితే! "వాళ్ళ కెందుకు చెప్పాలి?" అనిగూడా అన్నాడు బాబాయ్. నాకు ఏదో అనుమానం వేసింది. అంతలోకే గిరి వచ్చి, విషయం అంతా చెప్పాడు" అందుకే పట్టుకొచ్చాను. బాబాయ్! అని లేనిపోనివి కల్పించి చెప్పాడు నీలకంఠం.

"ఆహా! అలాగా! ఏరా! నావాచీ ఏదీ! ఎక్కడ దాచావు?" అనడిగారు శంకరం.

రాము ఆ ప్రశ్నకు క్రిందా మీదా అయిపోయాడు. ఏమిచెప్పాలో తెలీక అలాగే చూస్తూవుండిపోయాడు.

గిరి, నీలకంఠం రామూ సంచిలో మూటలో వెదకడం ప్రారంభించారు. వాళ్ళకేమీ దొరకలేదు. ఎలాదొరుకుంది?

"వీడెక్కడో దాచేసివుంటాడు బాబాయ్!" అన్నాడు నీలకంఠం.

"అసలు వెళ్ళేపుడు తనిఖీ చేయాల్సింది" అంది కాంతమ్మ.

"అమ్మా!...నిజంగా నాకేమీ తెలీదండీ!...అమ్మగారూ!... నన్ను!"...అంటూ రాము కాంతమ్మకాళ్ళ మీదపడిపోయాడు...గిరి, నీలకంఠంల సంతోషానికి అవధుల్లేకుండా పోతూంది.

"అబ్బా! ఏమినంగనాచివిరాబాబూ! ... ఇంత నాటకం ఎలా ఆడుతున్నావురా బాబా! ఛీ! వెధవా! ఛీ!" అంటూ కాళ్ళమీదపడ్డ రామును నిర్దయగా ఒక్కతాపు తన్నింది.

ఆ దెబ్బకు!...ముక్కు చెదరింది! రక్తం!...కాలువలా ఒక తూమునుండి ప్రవహిస్తున్నట్లుగానే! ప్రవహించిందపుడు.

రాము బెదరిపోయాడు..."బాబూ!...రక్తం!...రక్తం!...అబ్బ!...వాచీ:...నేను తియ్యలేదండీ!" రాము ముక్కును చొక్కాగుడ్డతో వత్తుకుంటు అన్నాడు. చొక్క రక్తంతో తడిసి రైల్వేపోర్టరు చొక్కాలా ఎఱ్ఱగా తయారైంది. ఆరక్తం! ఆప్రవాహ వేగం తగ్గలేదు. "ఇస్! అబ్బ! అమ్మా! బాధ!" అంటు రాము శంకరం కాళ్ళపై స్మారకంలేకండా పడిపోయాడు.

శంకరం బెదరిపోయాడు...రామూను కాళ్ళమీదుగా తీసి క్రిందపడుకోబెట్టి...గిరిచేత నీళ్ళు తెప్పించి ముఖం మీద చల్లాడు రక్తం గూడా ఆగేట్టు తడిగుడ్డతో తడిపి కాసేపు వత్తిపట్టాడు కాసేపటికి రక్త ప్రవాహవేగం తగ్గింది. కానీ రాము ఇంకా యధాస్థితిలోకి రాలేదు, కళ్ళుమూసుక అలానే పడివున్నాడు పెదాలుమాత్రం గాలిలో రావాకులా అదరుతోంది వణకుతోంది కాదు ఏదో పలువరిస్తూనే వున్నాడు. శంకరంగుండె వూరికే దిగజారిపోతూంది గుండె తనబొడ్డువరకు దిగజారినట్లుగ ఫీలయ్యాడు.

కంగారుపడిపోయి..."ఎంత పని చేశావే!...ఏమిటీ వీడిలా" అని శంకరం అనగానే అందరూ రామూచుట్టు మూగారు నీలకంట, గిరి మొఖంలపై కత్తివాటు వేసినా ఒక రవ్వంత నెత్తురుచుక్కా కారేట్టు గాలేదు. వాళ్ళూ బెదిరిపోయారు. ఒకరిమొఖాలు ఒకరు చూచుకుంటున్నారు.

(సశేషం)